# ఈ ప్రశ్నకు బదులేది?

★



రచన :

Dr. జె. భాగ్యలక్ష్మి M.A.PH.D.

శారద మొట్టమొదటిసారిగా ఆ ఇంట్లో అడుగుపెట్టే టప్పటికి ఎదురుగా కనిపించింది మోహన్ మంజులల ఫోటో (ఆమె పేరు మంజుల అనే విన్నట్లు జ్ఞాపకం.) భుజాల చుట్టూ చేయివేసి నిల్చునున్నాడు. ఆమె అలవోకగా మెడవాల్చి నవ్వుతోంది.

శారద భుజంపై చేయిపడింది. ప్రక్కనే మోహన్ నిల్చుని ఆమెతోపాటు ఫోటో చూశాడు. "మంజుల" అన్నాడు. శారద తెలుసునన్నట్లు తల వూపి లోపలికి నడచింది. మోహన్ ఆమెను అనుసరించాడు. ఇంటిల్లంతా కలయజూసింది. "చాలా బాగుంది" అంది. డబ్బాలూ అవీ పెట్టుకొనే అరలు, పైన స్టోరుకు వీలుగా పెట్టిన ఖాళీస్థలం, ఎత్తైయిన అరుగు, ప్రక్కనే వాష్ బేసిన్...చాలా అధునాతనంగా ఉంది.

ఆ తర్వాత లోపలి గదుల్లోకి వెళ్ళింది. ఒక గదిలో ఒక మంచం, చిన్న టేబిలు, కుర్చీలు రెండు, అలమారలో చిన్న చిన్న పుస్తకాలు కనిపించాయి. ఆ పక్కనే పుస్తకాల సంచి ఉంది. టేబిలుపైన ఫోటో ఫ్రేంలో... అదిదే మంజుల... చేతిలో ఒక బాబు.

"మురళి" అన్నాడు మోహన్.

అర్థమైందన్నట్టు చూసింది శారద.

"ఇప్పుడు సెలవులకని అమ్మమ్మగారి ఊరికి వెళ్ళాడు. వచ్చేవారం వస్తాడు. స్కూలు కదా."

"ఏ క్లాసు" అంది బల్లపై పుస్తకాలు సర్దుతూ.

"మూడు పాసయ్యాడు." కాస్సేపు మౌనం,

"వాడిని నీవు చూసుకోగలవా లేకపోతే..."

"లేకపోతే హాస్టల్లో చేర్పిస్తారా? బలేవారే."

"నువ్వుకూడా ఉద్యోగం చేస్తున్నావు కదా అందుకని..."

"అయితేమాత్రం మనబాబు మనకు బరువా?"

"బాబు కాదు, వాడిని మంజుల "చిన్నా" అని పిలిచేది."

శారద చురుక్కున చూసింది. మోహన్ మొహం తప్పించుకొన్నాడు. "ఏదో ఏర్పాటు చేద్దాంలే" అన్నాడు నెమ్మదిగా.

ఇద్దరూ పడక గదిలోకి వెళ్ళారు. అక్కడ మంజులది నిలువెత్తు చిత్రం. పెద్దపెద్ద కళ్ళతో శారదను తీక్షంగా

చూస్తున్నట్టుంది.

"మాకు తెలిసిన ఆర్టిస్టు ఒకాయన ఉన్నారు. ఆయన ఒకసారి మంజుల చిత్రం వేస్తానని పట్టుబడితే..."

శారద అక్కడున్న వార్డ్‌రోబ్ తెరిచింది. దాని నిండా ఎన్నో ఖరీదైన చీరలు వేలాడుతున్నాయి.

"మంజులకు చీరలమోజు చాలా ఉండేది."

శారద అలసిపోయినట్లు మంచంమీద కూర్చుంది.

"సారీ...శారదా, తన గురించి జ్ఞాపకాలు నన్ను వదలటంలేదు. తను నన్ను విడిచి పోయిందని నమ్మలేకుండా ఉన్నాను."

"మన పెళ్ళి విషయంలో తొందరపడ్డారేమో!"

"లేదు, చాలా ఆలోచించాకే ఈ నిర్ణయానికి వచ్చాను. జస్ట్ గివ్ మి సమ్ టైమ్, నిన్ను నిర్లక్ష్యం చేస్తాననుకోకు. నీకేమాత్రం అన్యాయం చెయ్యను" అన్నాడు ఆమె చెయ్యి తీసుకొని అభయమిస్తున్నట్లుగా.

* * *

మోహన్‌కు పన్నెండేళ్ళ క్రితమే పెళ్ళయింది. మంజుల ఒక ఇల్లాలిగా, భార్యగా, తల్లిగా తన పాత్రను అమోఘంగా నిర్వహించింది. వీరి దాంపత్యం చూసి అనూయపడ్డ వాళ్ళు కూడా లేకపోలేదు. అంతెందుకు ఆ దేవతలే వీరి అన్యోన్యానురాగాన్ని భరించలేకపోయారా అన్నట్లు ఆరు నెలల క్రితం ఆ ఘోరం జరిగింది. పుట్టింటినుండి తిరిగి వస్తుండగా ఆమె ప్రయాణం చేసే బోటు ప్రమాదానికి గురయింది. ఎవరూ బ్రతకలేదు. కొందరి శవాలు దొరికాయి. కొందరివి దొరకలేదు అదృష్టవశాత్తు మురళి అమ్మమ్మగారింట్లో ఉన్నాడు


MOTORS SEI PUMPS



325-1978



- ★ Excellant Performance.
- ★ Low Current Consumption.
- ★ Long Life.

OUR RANGE OF PRODUCTS

- ★ Electric Motors, Single Phase 1/4 H. P. to 2 H. P. 3 Phase 1/2 H. P. to 20 H. P.
- ★ Centrifugal Pumps.
- ★ Domestic Pumps.
- ★ Monoblock Sets (3 H. P. to 10 H. P.)

Manufacturers :

SOUTHERN ENGINEERING INDUSTRIALS

343, AVANASHI ROAD : : COIMBATORE - 641 037.

Branches :-

30, THAMBUCHETTY STREET, MADRAS - 600 001.

88, ARUNACHALA ASARI STREET, SALEM - 1.

గనుక బ్రతికిపోయాడు. చివరకు ఆమె మృతదేహాన్నయినా చూడలేకపోయినందుకు మోహన్ విలవిలలాడాడు. దుఃఖభారం వేరు. దాన్ని భరిస్తూ జీవితాన్ని భరించటం వేరు. అందుకే జీవితసత్యాలు ఎదురుపడగా మోహన్‌కు మళ్ళీ పెళ్ళిగాక ఇంకే మార్గమూ కనిపించలేదు. తాను ఉద్యోగం చేస్తున్న ఊర్లోనే కాన్వెంటు స్కూల్లో పనిచేస్తున్న శారద గురించి ఎవరో చెప్పారు. మోహన్ శారద అన్నయ్యతో మాట్లాడాడు. రెండో పెండ్లని, ఒక అబ్బాయి కూడా ఉన్నాడని శారదకు తెలుసు. మూడు పదులు నిండిన శారదకు జీవితానికి సంబంధించిన మరికొన్ని సత్యాలూ గ్రాహ్యమయ్యాయి. అందుకే ఈ పెళ్ళి సంబంధాన్ని చాల సహజంగా తీసుకొంది. పెళ్ళి నిరాడంబరంగా గుళ్ళో జరిగింది. పెళ్ళికి వచ్చిన అతిధుల సంఖ్య కచ్చితంగా పన్నెండు.

♦ ♦ ♦

శారద స్నానానికి వెళ్ళింది. తలారా స్నానంచేసి వచ్చేసరికి ఇంట్లో కొట్టొచ్చినట్లు మార్పు...తమ బెడ్ రూంలో ఆమె నిలువెత్తు చిత్రం లేదు. అక్కడ గోడ బోసిగా లేకుండా నిలువెత్తు అద్దం ఉన్న డ్రెస్సింగ్ టేబిలు ఉంది. నీళ్ళు కారుతున్న తడి జుట్టును తుడుచుకోకుండానే శారద భర్త కోసం అన్ని గదులూ చూసింది. సామాన్ల గదిలో ఈ పెద్ద చిత్రాన్ని గుడ్డలో చుట్టి పై అరలో పెట్టున్న మోహన్ కన్పించాడు.

"ఎందుకు తీసేసారు?" అంది శారద.

"నా జ్ఞాపకాలు నాకెంత అమూల్యమయినా వాటితో నీ జీవితాన్ని నరకప్రాయం చేయలేను శారదా! నీ తరఫునుండి కూడా ఆలోచించటం నేర్చుకోవాలి."

శారద కృతజ్ఞతతో చూసింది.

"మురళి గదిలో వాడి తల్లి ఫోటో ఉంటే పర్వాలేదు కదూ."

"మరీ నన్ను కించపరచకండి."

"ఆల్ రైట్ మై గర్ల్" అని మోహను చేతులు దులుపుకొంటూ ఇవతలికి వచ్చాడు.

మూడు నెలల కాలం మూడు క్షణాల్లా గడిచిపోయింది. అదో చిన్న సంసారం. ప్రేమాభిమానాలు పొంగిపొరలే సంసారం. మురళి శారదను 'కొత్తమ్మా' అని పిలుస్తాడు. తన తల్లి ఇక రాదని, కొత్తమ్మ అమ్మ



లాంటిదేనని మోహన్ నచ్చజెబితే బుద్ధిగా విన్నాడు మురళి. కొత్తమ్మ తనతో చక్కగా కబుర్లు చెబుతుంది. తీయగా పాడుతుంది. తన స్నేహితుల గురించి, తన ఆట పాటల గురించి శ్రద్ధగా వింటుంది. మురళికి కొత్తమ్మ దగ్గర హాయిగా ఉంది. ఒకసారి "కొత్తమ్మా మనిద్దరం ఫోటో తీసుకొందాం" అన్నాడు. అలాగే ఇద్దరూ ఫోటో తీసుకొన్నారు. అది తన బల్లపై ఇంకో ప్రక్కన పెట్టుకొన్నాడు మురళి.

శారద సాంగత్యంలో మోహన్ తన దుఃఖాన్ని మరవటమే కాదు, శారద పట్ల ఎంతో అనురాగాన్ని పెంచుకొన్నాడు. ఇంత చక్కగా జీవితాన్ని స్వర్గంగా మార్చే ఇల్లాలు దొరికే అదృష్టం అందరికీ ఉండదు. తన జీవనపాత్ర ఇంతగా పొంగి పొరలుతూంది ఏ ఉపద్రవానికో అని భయపడేవాడు అప్పుడప్పుడు.

"మీరు ఒట్టి పిరికి మనుష్యులు. ఎప్పుడో ఏదో జరుగుతుందని ఇప్పుడే భయపడుతారే" అనేది శారద నవ్వుతూ.

"అందుకే దొరికిన ప్రతిక్షణం నిండుగా జీవించెయ్యాలి" అంటాడు మోహన్ ఆమెను పొదువుకొంటూ.

ఆ సాయంకాలం మోహన్ ఇంటికి వచ్చేసరికి శారద మామూలు కంటె హుషారుగా కనిపించింది.

"ఏం విశేషం" అన్నాడు మోహన్ కాఫీ త్రాగుతూ.

"ఈ రోజు మనం సినిమాకు వెళ్దాం. మంచి హోటల్లో భోంచేద్దాం. బాగా ఎంజాయి చేద్దాం" అంది నవ్వుతూ.

మోహన్ ఆమె కళ్ళలోకి చూస్తూ కూర్చున్నాడు.

"అర్థమయింది" అన్నాడు చివరకు.

"ఏమిటి" అంది పెదవుల మధ్య నవ్వుదాస్తూ.

"నువ్వు నాకో బుజ్జిపాపను ఇస్తున్నావు" అన్నాడు.

"ఎంత కరెక్టుగా చెప్పారు!" అంది.

"అనుభవం" అంటూ నవ్వాడు. "త్వరగా తయారుకావాలి. సినిమాకు టైం అవుతుందమ్మాయ్" ఆమె బుగ్గపై చిటిక వేసి లోపలి గదిలోకి వెళ్ళాడు.

శారద చక్కగా అలంకరించుకొంది. మురళి ఆటలకు వెళ్ళి ఇంకా రాలేదు. ఈ రోజు తాము సినిమాకు వెళ్తున్నట్టు ముందే చెప్పింది. ఆటలయ్యాక వచ్చి ఆయా అన్నం పెడ్తే తినమని చెప్పింది. మురళికి ఇంకా సినిమాలు అలవాటు కాలేదు. ఇంతవరకూ ఈయన రాలేమిటి అని వాచీ చూసుకొంటూ లోపలి గదిలోకి వెళ్ళింది శారద. అతని చేతిలో ఉత్తర మొకటి రెపరెపలాడుతోంది. అది మధ్యాహ్నం వచ్చింది. తనే తీసి బల్లపై పెట్టింది.

"ఏమిటంత ఆలోచనలో ఉన్నారు" అంది దగ్గరగా వచ్చి అతని మొహాన్ని చేతుల్లోకి తీసుకొంటూ. మోహన్ కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.

"ఏమయింది. అందరూ బాగున్నారు కదా" అతని చేతిలోనుండి ఉత్తరం తీసుకొంది. అది మంజుల అన్నగారు వ్రాసిన ఉత్తరం.

"... మంజుల బ్రతికే ఉంది. తనెక్కడో మారుమూల పల్లెలో 'కోమా'లో ఉందట ఇన్నాళ్ళు. అక్కడే ఎవరో వైద్యమూ అదీ చేయించారు, కాస్త మనలోకంలో పడగానే నాకు ఉత్తరం వ్రాయించింది. నేను వెళ్ళి తీసుకువచ్చాను. చాలా బలహీనంగా ఉంది. డాక్టర్లకు చూపించాను. త్వరలో కోలుకొంటుందని ఆశిస్తున్నాను..."

ఈ జాబుకు బదులేమి? ఈ ప్రశ్నకు బదులేది?

కె. పి. జి. వారి అపూర్వ కానుక!!

♦ రాజు ఇజిప్షిన్ ♦ టిప్‌టాప్ ప్లైన్.
♦ గోరా ఇజిప్షిన్ ♦ చిల్డ్రన్
♦ గోల్డన్ డాలర్ ♦ కె. పి. జి. ఇంటర్‌లాక్

మరియు ఇతర రకాలకు ప్రసిద్ధి చెందిన పేరు

"కె. పి. జి."

తయారించువారు :

K. P. G. Knitting Co.

4/2, Harvey Road :: TIRUPUR-638602